సాక్షి అనంతపురం

బుధవారం। 13। నవంబర్। 2024



చీనీ టన్ను రూ.33,800

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,800 పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 చొప్పున క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
32.4°/18.1°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. రానున్న ఐదు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు!

అనంతపురం అగ్రికల్చర్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు... వారి వారి పరిధిలో వంద శాతం దుకాణాలను తనిఖీ చేయాలని ఆరుగురు ఏడీఏలు, 31 మంది ఏఓలతో కలిసిన బృందాల సభ్యులను జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. ప్రధానంగా ఎరువుల సరఫరా, అమ్మకాలు, నిల్వలు, లైసెన్సులు, నిషేధిత బయో ఎరువుల అమ్మకాలు, రైతులకు ఇచ్చే బిల్లులు, డీబీటీ విధానం అమలు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలకు సంబంధించి సమగ్రంగా తనిఖీలు కొనసాగించేందుకు ఇంటర్నల్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే స్టాప్ సేల్స్, సీజ్, 6–ఏ కేసులు, ఇతర చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించాలన్నారు.

ఇసుక రీచ్ వద్దే వద్దు



రీచ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీడీ, ఏడీలు

యల్లనూరు: తిరుమలాపురం – చిలమకూరు సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టరు వెంకటేశ్వర్లు, తాడిపత్రి ఏడీ ఓబుళరెడ్డి మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇసుక రీచ్ ప్రదేశాన్ని పరిశీలించి, అనంతరం తిరుమలాపురం పంచాయతీ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. చిలమకూరు, తిరుమలాపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఇసుక రీచ్ వద్దని ముక్తకంఠంతో నినదించారు. రీచ్ ప్రారంభిస్తే ప్రాణాలు పోవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ విషయమై గ్రామస్తులు మైనింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో రాయల్టీ ఇన్‌స్పెక్టరు కవిత, చిలమకూరు సర్పంచ్ పెద్ద నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రవిచంద్రారెడ్డి, హరినాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యోగానందరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 20 నుంచి నిరసనలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అనంతపురం అర్బన్: విద్యుత్ చార్జీల పెంపుపై ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపు ద్వారా ప్రజలపై రూ.18 వేల కోట్ల భారాన్ని కూటమి సర్కార్ మోపుతోందన్నారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.2,94,427 కోట్ల బడ్జెట్ నిరాశాజనకంగా ఉందన్నారు.సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు శ్రీరాములు, లింగమయ్య, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నిర్దేశిత వయసులో వేయాల్సిన టీకాలు ప్రభుత్వాస్పత్రుల్లో అరకొరగా ఉన్నాయి. సకాలంలో టీకాలు వేయించుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నా.. అందుకు తగ్గ టీకాలు అందుబాటులో ఉండకపోవడం గమనార్హం.



- ఉమ్మడి జిల్లాలో అందుబాటులో లేని వ్యాక్సిన్‌లు
- పెంటావాలెంట్ వ్యాక్సిన్ లేక బాలింతల ఆందోళన
- వేలాదిమంది చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- హెపటైటిస్ బి, మీజిల్స్ వ్యాక్సిన్‌లూ కొన్నిచోట్ల కొరత
- విధిలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో కొనుక్కుంటున్న సామాన్యులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ చిన్నారులకు వేసే వ్యాధినిరోధక టీకాలు సమయానికి అందడం లేదు. పుట్టిన వెంటనే వేయాల్సిన కొన్ని రకాల వ్యాక్సిన్‌లు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బు చెల్లించి వేయించుకునే పరిస్థితి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధిగా ఉండాల్సిన ముఖ్యమైన టీకాలు స్టాకు లేవని చెబుతున్నారు. దీంతో వ్యయప్రయాసలకోర్చి తమ చిన్నారిని వ్యాక్సిన్‌కు తీసుకెళ్లే బాలింతలు నిరాశతో వెనుదిరిగి వస్తున్నారు. నిర్ణయించిన మేరకు వారానికి రెండు రోజుల పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లలో వ్యాక్సిన్ ఉండాలి. కానీ అందుబాటులో ఉండడం లేదు. కొన్ని చోట్ల వ్యాక్సిన్‌కు వెళ్లిన బాలింతలకు ఇప్పుడే వేయకపోయినా ఫరవాలేదు, ఇంకో రెండు వారాలు ఆగి రండి అంటూ ఆరోగ్య సిబ్బంది చెప్పి పంపుతున్నారు.

హెపటైటిస్–బీ 24 గంటల్లో ఇవ్వాల్సి ఉన్నా...

శిశువు పుట్టిన ఇరవై నాలుగు గంటల్లోనే కామెర్ల వ్యాధి రాకుండా హెపటైటిస్– బి వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ వ్యాక్సిన్ ప్రధాన ఆస్పత్రుల్లోనే లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేయించుకోవాలంటే భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టాకు ఇంకా రాలేదని చెబుతుండటంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుక్కుని తెచ్చి తమ బిడ్డలకు వేయించుకుంటున్నారు. మీజిల్స్ రూబెల్లా (తట్టు రాకుండా) వేసే వ్యాక్సిన్ కూడా కనిపించడం లేదు. అత్యంత ప్రమాదకరమైన కోరింత దగ్గుకు ఇచ్చే డీపీటీ వ్యాక్సిన్ కొన్ని చోట్ల లేదు. విజయవాడ నుంచి ఇంతవరకూ సరఫరా కాలేదని వైద్యులు చెబుతున్నారు.

- వ్యాధినిరోధక టీకాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ అత్యంత కీలకమైనది. అత్యంత ప్రమాదకరమైన డిఫ్తీరియా (కోరింత దగ్గు), టెటనస్, హెపటైటిస్– బి వంటి వ్యాధులు రాకుండా రక్షణనిస్తుంది. ఒక విధంగా వ్యాధినిరోధక టీకాల్లో ఇది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. అలాంటి వ్యాక్సిన్ ఇప్పుడు అన్ని చోట్లా పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు. ఇది బిడ్డ పుట్టిన 6 వారాల్లోగా వేయాలి. తిరిగి ఏడాదిలోపు మళ్లీ ఒకసారి వేయాలి. అత్యంత సమర్థవంతంగా పనిచేసే ఈ వ్యాక్సిన్ ఇప్పుడు అరకొరగా ఉండటం ఇబ్బందిగా ఉంది.

ఏ వ్యాక్సిన్ ఎప్పుడు వేయించుకోవాలి...

వ్యాక్సిన్	మొదటి డోసు	రెండో డోసు
మీజిల్-రూబెల్లా	9-12 నెలల మధ్య	16-24 నెలల మధ్య
ఇనాక్టివ్ పోలియో వ్యాక్సిన్	ఏడాదిన్నరకు	మూడున్నరేళ్ల లోపు
రోటా వ్యాక్సిన్	ఏడాదిన్నరకు	మూడున్నరేళ్ల లోపు
డీపీటీ	16-24 నెలల మధ్య	5 ఏళ్ల లోపు
హెపటైటిస్ - బి	పుట్టిన 24 గంటల్లోనే	-
పెంటా వాలెంట్	పుట్టిన 6 వారాల నుంచి	ఏడాది లోపు
విటమిన్ ఎ సిరప్	9 నెలలలోపు	16-24 నెలల మధ్య

ఉమ్మడి జిల్లాలో వ్యాక్సిన్‌కు అర్హులైన 0-5 ఏళ్లలోపు పిల్లలు 5 లక్షల మంది

ఏడాదిలో జననాల సంఖ్య 45 వేల నుంచి 50 వేలు



సరఫరా లేటవుతోంది



వ్యాక్సిన్‌లు అన్నీ విజయవాడ నుంచే రావాలి. అక్కడి నుంచి రావడం కాస్త ఆలస్యమవుతోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కూడా ఒకే వాహనంలో సరఫరా చేయాల్సి ఉంది. ఇటీవల జిల్లాకు వచ్చిన వ్యాక్సిన్‌లు ఎక్కడెక్కడ లేవో అక్కడికి ప్రాధాన్యతా క్రమంలో పంపిస్తున్నాం.

–డాక్టర్ యుగంధర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అనంతపురం

టీకాలు వేసుకోకపోతే సమస్యలు



టీకాలు క్రమం తప్పకుండా వేసుకోవాలి. టీకాలు వేసుకోవడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. ఆలస్యమైతే వ్యాధుల బారిన పడే అవకాశం లేకపోలేదు. పుట్టినప్పటి నుంచి 15 ఏళ్ల వరకు టీకాలు వేసుకోవచ్చు. వివిధ దశల్లో టీకాలు వేసుకోకపోతే టీబీ, కోరింత దగ్గు, ధనుర్వాతం, టెటనస్, న్యుమోనియా, డయేరియా, పోలియో, మీజిల్స్, రూబెల్ల, తదితర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు టీకాలు వేయించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, అనంతపురం

‘అపార్’ పూర్తి చేయాల్సిందే

అనంతపురం అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు సంబంధించి ఆధార్ తరహా అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్) ఐడీ జనరేషన్‌ను కచ్చితంగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సకాలంలో పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల విద్య అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో విద్య, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూడైస్ 2024–25 కింద జిల్లాలో 3,70,767 మంది విద్యార్థులు ఉంటే ఇప్పటి వరకు 2,17,892 మంది ఆపార్ జనరేషన్ (58.77) శాతం మాత్రమే పూర్తి చేశారు. ఇది సరైన పనితీరు కాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. ప్రతి పాఠశాలకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను కేటాయించాలని ఆదేశించారు. వారికి అపార్ జనరేషన్ బాధ్యత అప్పగించాలని డీపీఓను ఆదేశించారు. ప్రతి మండలాన్నీ రెండుగా విభజించి ఇద్దరు ఎంఈఓలకు పాఠశాలలను సమానంగా కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 110 ఆధార్ కేంద్రాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయడంతో పాటు వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రోజూ 10 వేల అపార్ ఐడీ జనరేట్ చేయాలని చెప్పారు. కార్యక్రమ వేగవంతానికి ఆధార్ నోడల్ అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ ప్రక్రియ కోసం ప్రతి పాఠశాలలోనూ మూడు బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రొఫైల్ అప్‌డేషన్‌కు ఒక బృందాన్ని, అపార్ ఐడీ జనరేషన్‌కు ఒక బృందాన్ని, నామినల్ రోల్స్ కోసం ఒక బృందాన్ని నియమించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యార్థుల హాజరు పెరగాలి

విద్యార్థుల హాజరు పెరగాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 17,901 మంది డ్రాప్ అవుట్లు ఉన్నారని, ఇందుకు సంబంధించి సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరు, ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. పీఎంశ్రీ ప్లే గ్రౌండ్లకు సంబంధించి 92 మంజూరు కాగా 48 పూర్తి చేశారని, మిగిలిన 44 త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఈఓ పరసాద్ బాబు, డీపీఓ నాగరాజునాయుడు, సాంఘిక సంక్షేమశాఖ జేడీ ప్రతాప్‌సూర్యనారాయణరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, ఆధార్ నోడల్ అధికారి నారపరెడ్డి, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు

అనంతపురం: ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేసిన కేసులో ముద్దాయికి పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి జీవితఖైదు విధించారు. వివరాల్లోకి వెళితే... 2020 నవంబర్ 18వ తేదీన గోరంట్ల మండలం నార్సింపల్లికి చెందిన దంపతులు కూలి పనికి వెళ్లగా...వారి ఐదేళ్ల కుమార్తె ఇంటి ముందు ఆడుకుంటూ ఉంది. ఈ సమయంలో అక్కడికి వచ్చిన గొల్ల ఆదినారాయణ (54) చిన్నారికి మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. అనంతరం బాలికపై లైంగిక దాడి చేశాడు. కూలి పనుల నుంచి వచ్చిన బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకుని అదే రోజు గోరంట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ జయనాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి ప్రభుత్వం పోక్సో కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు రాష్ట్రంలో దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయగా... అప్పటి దిశ డీఎస్పీ (ప్రస్తుత ఏఎస్పీ) ఆర్ల శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, 10 మంది సాక్షులను విచారించిన అనంతపురం స్పెషల్ సెషన్స్ కోర్టు, పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి... నేరం రుజువుకావడంతో ముద్దాయి గొల్ల ఆదినారాయణకు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ముద్దాయికి శిక్ష పడేలా చేసిన ప్రస్తుత గోరంట్ల సీఐ శేఖర్, కోర్టు లైజర్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వీవీ నాయక్, సుధాకర్, కరుణాకర్‌రెడ్డి తదితరులను శ్రీసత్యసాయి ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాథమిక పరిశీలన 30 లోపు పూర్తి చేయండి

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం పరికరాల మంజూరుకు సంబంధించి ఇప్పటి వరకూ అందిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 30లోపు ప్రాథమిక పరిశీలన (ప్రిలిమినరీ ఇన్స్‌పెక్షన్) పూర్తి చేసి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఉద్యానశాఖ జిల్లా అధికారులను ఆ శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం ఆయన గుంటూరు నుంచి ఏపీఎంఐపీ పీఓ ఎం.వెంకటేశ్వర్లుతో కలసి సూక్ష్మ సాగు పథకం అమలుపై జిల్లా పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, కంపెనీ డీసీఓలతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా 42,100 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని అనంతపురం జిల్లాకు లక్ష్యంగా ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆర్‌ఎస్‌కే వేదికగా 39,637 మంది రైతులు 55,478 హెక్టార్లకు పరికరాలు కావాలని ఇప్పటికే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. అయితే ఇందులో 13,486 మంది రైతులకు 16,569 హెక్టార్లకు ఇవ్వడానికి వీలుగా ప్రాథమిక పరిశీలన చేశారన్నారు. ప్రస్తుతానికి 3,462 మంది రైతులు 4,094 హెక్టార్లకు కావాలని తమ వాటా కింద డిజిటల్ రూపంలో డీడీలు చెల్లించారని, 2,600 మంది రైతులకు 3,081 హెక్టార్లకు పరికరాలను కలెక్టర్ ద్వారా మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇంకా మిగులు దరఖాస్తుల ప్రాథమిక పరిశీలనపై దృష్టి సారించి, అర్హుల జాబితా సిద్ధం చేసి, బీఓక్యూ, బీఎంసీ, డీడీ చెల్లింపు, శ్యాంక్షన్, మెటీరియల్ సరఫరా, ఇన్‌స్టాలేషన్, తుది పరిశీలన (ఫైనల్ ఇన్స్‌పెక్షన్) తదితర ప్రక్రియ కొనసాగించాలని ఆదేశించారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీలకు 20 శాతం, బీసీలకు 66, ఎస్టీలకు 14, ఈబీసీ అభ్యర్థులకు 10 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు, స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08554–275575, 7799043773 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మా వారిని కాదని ఎలా ఇస్తారు?

- కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు బెదిరింపు
- ఇద్దరిని విధుల్లోకి చేర్చుకోకుండా వెనక్కు పంపిన వైనం
- కేశవ్ ఇలాకాలో రెచ్చిపోయిన ‘తమ్ముళ్లు’



అనంతపురం ఎడ్యుకేషన్: ‘విద్యాశాఖను చాలెంజ్‌గా తీసుకున్నా. రాష్ట్ర విద్యాశాఖను దేశంలోనే టాప్‌లో నిలబెడతా. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా పెట్టాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం’– ఇవీ రెండు రోజుల కిందట విజయవాడలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పిన మాటలు. అదేరోజు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోయారు. మోడల్ స్కూల్‌లో వార్డెన్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగాల్లో చేరేందుకు వెళ్లిన ఇద్దరు మహిళలను తీవ్రస్థాయిలో బెదిరించారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీఆర్టీ, పీజీటీ, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, అకౌంటెంట్, వార్డెన్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఆయా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో 16 సీఆర్టీ, 19 పీజీటీ, 15 పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, 4 అకౌంటెంట్, 6 వార్డెన్ పోస్టులను భర్తీ చేశారు. ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించి ఆయా ఖాళీలను భర్తీ చేశారు. ఉరవకొండ మోడల్ స్కూల్‌లో వార్డెన్ పోస్టుకు బంగి సునీత, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు మాదిగ రాజేశ్వరి ఎంపికయ్యారు. సోమవారం జాయిన్ అయ్యేందుకు మోడల్‌స్కూల్‌కు వెళ్లగా టీడీపీకి చెందిన కొందరు చోటా నాయకులు అడ్డుకున్నారు. ‘మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల్లోనూ బయట వ్యక్తులెవరూ చేరకూడదు. మావాళ్లు చాలామంది ఉన్నారు. వారిని కాదని బయటవాళ్లు ఎలా చేరతారు?’ అని ప్రిన్సిపాల్‌ను బెదిరించారు. అంతటితో ఆగకుండా ఆ ఇద్దరు ఉద్యోగుల నియామక పత్రాలను చేతికి తీసుకుని చింపేస్తామంటూ భయపెట్టారు. తమమాట కాదని ఇక్కడ చేరితే.. డ్యూటీ ఎలా చేస్తారో చూస్తాం అంటూ హెచ్చరించారు. దీంతో వారిద్దరినీ చేర్చుకోకుండా ప్రిన్సిపాల్ వెనక్కు పంపారు. బాధితులు మంగళవారం రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత సమగ్రశిక్ష ఏపీసీతో మాట్లాడతానని బాధితులకు చెప్పి పంపారు.

అరకొర కేటాయింపులతో దగా

- ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం

అనంతపురం కార్పొరేషన్: బడ్జెట్‌లో సూపర్ సిక్స్ పథకాల అమలుకు అరకొరగా నిధులు కేటాయించి ప్రజలను రాష్ట్రప్రభుత్వం దగా చేసిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సంపద సృష్టించి ప్రజలకు పంచి పెడతామని చెప్పిన చంద్రబాబు.. ఆచరణలో ఎవరికి పంచి పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినపుడు ప్రారంభంలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం చేసిందని, ఆర్థికంగా నష్టపోయామంటూ అబద్ధాలు చెప్పి అందరినీ మభ్యపెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు ఎక్కడా కన్పించలేదన్నారు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకానికి ఏటా రూ.6వేల కోట్లు అయ్యిందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుకు రూ.12వేల కోట్లు అవుతుందని చెప్పారన్నారు. బడ్జెట్‌లో మాత్రం రూ.2491 కోట్లు కేటాయిస్తే లబ్ధిదారులకు ఎక్కడ న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఒక్కో రైతుకు రూ.13,500 రైతు భరోసా సాయం అందించారని, కూటమి ప్రభుత్వంలో అన్నదాతా సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేల చొప్పున అందిస్తామని మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవకు రాష్ట్రంలోని 53 లక్షల మంది రైతులకు రూ.10 వేల కోట్లు అవసరమైతే బడ్జెట్‌లో రూ.5వేల కోట్లే కేటాయించారన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఒక్కొక్కరికి రూ.1500, ఉచిత బస్సుపై బడ్జెట్‌లో ప్రస్తావనే లేదన్నారు. ఇరిగేషన్ కేటాయింపుల్లోనూ అన్యాయం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, చిత్రంలో హరీష్ యాదవ్

నాడు జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయ్

కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, రూ.లక్ష కోట్ల నష్టం జరిగినా, ఆదాయం రాకున్నా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా పథకాలు అమలు చేశారని విశ్వేశ్వరరెడ్డి గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో 97 శాతం అమలు చేశారన్నారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడమే కాకుండా వారిలో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జగన్ పాలనలో రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశారని, శ్రీలంక పరిస్థితికి ఏపీని తీసుకువస్తున్నారని టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేశారని, ఇవాళ అసెంబ్లీ వేదికగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర అప్పు రూ.4.70 లక్షల కోట్లు, కార్పొరేషన్, తదితర వాటికి ఇచ్చిన హామీలు రూ.1.54 లక్షల కోట్లు మొత్తం రూ.6.40 లక్షల కోట్ల అప్పు ఉన్నాయని చెప్పారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే వైఎస్సార్‌సీపీ సామాజిక కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ మాజీ చైర్మన్ హరీష్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కక్షసాధింపు చర్యలకు స్వస్తి పలికి రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి పెంచడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని సూచించారు.

క్లుప్తంగా

పి.యాలేరులో 'పొలం పిలుస్తోంది'


బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవికుమార్

ఆత్మకూరు: పి.యాలేరు గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రవికుమార్, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత పొలాలను పరిశీలించారు. ఏ పంటలకు ఏమందులు ఎంత మోతాదులో పిచికారీ చేయాలన్న విషయాలను రైతులకు తెలియజేశారు. రబీ 2024–24 నుంచి రైతులు అవసరమైన ప్రీమియం చెల్లించి స్వచ్ఛందంగా ఈ పథకంలో నమోదు కావాల్సి ఉంటుందన్నారు. ఆహార ధాన్యాలు, నూనెగింజల పంటలకు రబీలో 1.5 శాతం, ఖరీఫ్ సీజన్ 2 శాతం ప్రీమియం చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పీఎమ్ఎఫ్‌బీవైలో పంటకోత ప్రయోగాల ఆధారంగా వాస్తవ దిగుబడి లెక్కించి హామీ దిగుబడి కన్నా తగ్గిన సందర్భంలో సంబంధిత ఇన్సూరెన్స్ యూనిట్‌లోని రైతులందరికీ నష్ట శాతం లెక్కించి బీమా పరిహారం చెలిస్తుందని వివరించారు.

'బొజ్జమ్మను పదవి నుంచి తొలగించాలి'


రాప్తాడు: వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మను పదవి నుంచి వెంటనే తొలగించాలని రాప్తాడు నియోజకవర్గ వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాప్తాడులో వాల్మీకి నాయకులు వాల్మీకి విగ్రహం వద్ద బొజ్జమ్మ నియామకంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు బోయ రామాంజనేయులు, కుంటిమద్ది రమేష్, పేరూరు మోహన్, దాసరి ప్రభాకర్ మాట్లాడుతూ ఏకిల(పాల ఏకిల) సామాజిక వర్గానికి చెందిన బొజ్జమ్మను వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించడం ప్రభుత్వ పెద్దలకు తగదన్నారు. కూటమి ప్రభుత్వంలో వాల్మీకి నాయకులే లేరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాల్మీకేతురాలైన బొజ్జమ్మను పదవి నుంచి తొలగించాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అలాగే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. వాల్మీకి నాయకులు అంకే అశోక్, బాలరాజు, బయన్న, సింగారప్ప, రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

'నిమోనియా'ను నివారిద్దాం


పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యాధికారులు

అనంతపురం మెడికల్: పిల్లల్లో నిమోనియా వ్యాధిని నివారిద్దామని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, డీఐఓ యుగంధర్ పిలుపునిచ్చారు. మంగళవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 25వ తేదీ వరకు పలు దశల్లో నిమోనియాపై స్క్రీనింగ్ ప్రక్రియ చేపట్టి, వ్యాధి ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిమోనియా వ్యాధిగ్రస్తుల సర్వేకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వారు విడుదల చేసి, మాట్లాడారు. ఏఎన్ఎం, ఇతర సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి నిమోనియాతో బాధపడుతున్న పిల్లలు, వృద్ధులను గుర్తించి తగు వైద్య చికిత్సలనందిస్తారన్నారు. పుట్టినప్పటి నుంచి 6 నెలల పాటు తల్లి పాలు పట్టించాలని, వ్యాధి నిరోధక టీకాలు వేయించడంతో పాటు పౌష్టికాహారం తీసుకునేలా జాగ్రత్తలు తీసుకుంటే చిన్నారుల్లో నిమోనియా వ్యాధి నివారణ సాధ్యమవుతుందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనుపమజేమ్స్, వైద్యులు డాక్టర్ గంగాధర్‌రెడ్డి, గణాంకాధికారి మహమ్మద్ రఫీ, ఏఓ గిరిజ మనోహర్ రావు పాల్గొన్నారు.

జపాన్ బృందంతో జేఎన్‌టీయూ వీసీ భేటీ



జపాన్ బృందంతో ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు మంగళవారం విజయవాడలో జపాన్ బృందంతో భేటీ అయ్యారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్)కు సంబంధించి జేఎన్‌టీయూ అనంతపురంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేశామని ఇన్‌చార్జ్ వీసీ తెలిపారు. విదేశీ విద్యార్థుల సౌలభ్యం కోసం అంతర్జాతీయ ఒప్పందాలను సులభతరం చేయడానికి వీలుగా యూనివర్సిటీలో ప్రత్యేక విభాగం ఉందన్నారు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, మెకాట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ వీఎల్ఎస్ఐ, సెమీ కండక్టర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర కోర్సుల్లో ఇతర దేశాల యూనివర్సిటీలతో విద్యార్థుల పరస్పర అడ్మిషన్లు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని జపాన్ ప్రతినిధులతో పేర్కొన్నట్లు తెలిపారు. జపాన్ బృందంలో టొయామా డిస్ట్రిక్ట్ తరఫున పరిశ్రమల వ్యవహారాల డైరెక్టర్ హొంగోయా మిస్, ట్యోయా తరఫున ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలు చూసే ఐటోబో, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ట్రేడ్ మురాటా, అకిరో యోకాటా పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా


మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం మెడికల్: ఈ విద్యాసంవత్సరంలో అనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఘనస్వాగతం పలుకుతూ అవిన్య పేరుతో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ఆటపాటలతో మెడికోలు అలరించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అధ్యాపకురాలు అనురాధ స్ఫూర్తితో బెంగళూరులో తాను ఎంబీబీఎస్ పూర్తి చేసినట్లు తెలిపారు. అయితే కలెక్టర్ అయితే నిరుపేదలను ఆదుకునేందుకు వీలవుతుందన్న తన తండ్రి ఆశయాన్ని నెరవేర్చేందుకు సివిల్ సర్వీసెస్‌లో ఐఏఎస్ సాధించి కలెక్టర్‌నయ్యానన్నారు. కోవిడ్ సమయంలో రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఓ ఐఏఎస్‌గా తాను చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ మధు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని నృత్య ప్రదర్శన


చుట్టమల్లే చుట్టేస్తాంది: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు


చిందేయ్: నృత్యంతో అలరిస్తున్న విద్యార్థులు


కెవ్వుకేక: డ్యాన్స్ చేస్తున్న వారిని ఉత్సాహ పరుస్తున్న విద్యార్థినులు

సాగునీటి కేటాయింపులపై పునఃసమీక్ష అవసరం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం అర్బన్: జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధికి రూ.7 వేల కోట్లు అవసరమైతే రూ.వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదని, ఈ కేటాయింపులపై పునఃసమీక్షించాలని ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల ఆశలను కూటమి సర్కార్ నీరుగారుస్తోందని మండిపడ్డారు. ఈ నెల 11న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనమన్నారు. జిల్లాకు జీవనాడిగా ఉన్న హెచ్చెల్సీ స్టేజ్–1, స్టేజ్–2 పనులకు రూ.792 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా కేవలం రూ.28.2 కోట్లు, హంద్రీ–నీవా కాలువ వెడల్పునకు రూ.6,700 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా రూ.867.75 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. తుంగభద్ర డ్యాం పరిరక్షణకు కొత్త గేట్లను తక్షణం ఏర్పాటు చేయాలని కేంద్ర జల వనరుల శాఖ నిపుణులు నివేదిక ఇచ్చినా ఇందుకు సంబంధించి రాష్ట్ర వాటా నిధుల అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడం, బొమ్మనహాళ్ మండలంలో 15 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన ఉంతకల్లు రిజర్వాయర్‌పై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కనీసం మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ–నీవా కాలువ వెడల్పు చేస్తామన్న సీఎం చంద్రబాబు హామీ నెరవేరాలంటే ఈ నిధులు సరిపోవన్నారు. బీటీ ప్రాజెక్టు, పేరూరు ప్రాజెక్టులతో పాటు పీఏబీఆర్ కుడికాలువ, యాడికి కాలువ, సుబ్బరాయసాగర్ పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఓ.నల్లప్ప పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మీ

రాప్తాడు: పంచాయతీల్లో 2025–26కు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ బుల్లే విజయలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద 2025–26 గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు. సీఐ టీ.వి.శ్రీహర్ష, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, పీఆర్ జేఈ కిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వరలక్ష్మీ, ఏపీఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: గ్రామ పంచాయితీల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ హేమలత, డీఎల్‌డీఓ లలితాబాయి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ ప్రణాళికలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రణాళిక ఉండాలన్నారు. పంచాయతీ సెక్రటరీలు మహబూబ్ బాషా, మల్లేష్, ప్రభాకర్, మానస, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అగ్రిమెంట్ చేసి పనులు చేయకపోతే ఎలా?

- నెలల తరబడి పెండింగ్ ఉంచొద్దు
- నగరపాలక సంస్థ అధికారుల సమీక్షలో మేయర్ వసీం


అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి

అనంతపురం కార్పొరేషన్: నగరంలో అభివృద్ధి పనులకు సంబంధించి 90 పనులకు అగ్రిమెంట్ జరిగినా..ఇంత వరకు పనులు చేయకపోతే ఎలా అని, వెంటనే పనులు ప్రారంభించేలా చూడాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో మేయర్ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి కమిషనర్ నాగరాజు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. పనుల జాప్యంపై ఆరా తీశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుంతలు పూడ్చాలని చెప్పినా ఎందుకు చేయలేదని మేయర్ ప్రశ్నించారు. లైట్లు, పారిశుధ్య కార్మికులకు పనిముట్లను కొనుగోలు చేయాలన్నారు. బాక్స్ టెండర్లను ఎందుకు రద్దు చేశారని, నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. హిందూ, ముస్లింలను ఉపయోగించే శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. నగరంలో నీటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముద్దలాపురం ఫిల్టరేషన్ పాయింట్‌లో నీటి శుద్ధి సక్రమంగా జరిగేలా చూడాలన్నారు.

కుక్కల స్టెరిలైజేషన్‌కు రూ.14 లక్షలా?

కుక్కల స్టెరిలైజేషన్‌కు రూ.14 లక్షలు వెచ్చించినా నగరంలో కుక్కల బెడద తగ్గలేదని మేయర్ పేర్కొన్నారు. సదరు ఏజెన్సీకి రూ.లక్షల్లో బిల్లు ఏవిధంగా ఇచ్చారని కమిషనర్‌ను మేయర్, డిప్యూటీ మేయర్లు ప్రశ్నించారు. దీంతో ఆయన నీళ్లు నమిలారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి సైతం కళ్లు తేలేశారు. చెక్కు పంపిణీ, స్టెరిలైజేషన్‌పై విచారణ చేపట్టాలని మేయర్ ఆదేశించారు. ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని వాడితే ఉపేక్షించేది లేదని, కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

స్కావెంజర్ లేన్ అంటే ఏంటీ?

సమావేశంలో కార్పొరేటర్ అబూసలేహ స్కావెంజర్ లేన్‌ను శుభ్రం చేయించాలని అధికారులకు విన్నవిస్తే..స్కావెంజర్ లేన్ అంటే ఏంటని కమిషనర్ అనడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఒక్కసారిగా ఇంజినీర్లు సైతం కమిషనర్‌వైపు చూశారు. సమావేశంలో ఈఈ షాకీర్, డీఈలు నరసింహం, బీఎల్ నరసింహ, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు

అనంతపురం సెంట్రల్: నగరంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపాన పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఏడీఏ లక్ష్మానాయక్, వ్యవసాయశాఖ అధికారి శశికళ సంయుక్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మూడు దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, ఓ-ఫామ్స్, రైతులకు సక్రమంగా బిల్లులు ఇవ్వకపోవడంతో రూ. 30.05 లక్షలు విలువల చేసే రసాయనిక ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు.

ఇంగ్లిష్ టీచర్ల పదోన్నతులు చేపట్టాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కోర్టు కేసుల కారణంగా జిల్లాలో నిలిచిపోయిన ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సమస్యను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వెంటనే పదోన్నతులు జరిగేలా చూడాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డీఈఓ ప్రసాద్ బాబును కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణలో తప్పిదాలు, అసంబద్ధాలను వెంటనే పరిష్కరించాలని కోరారు. 2003 డీఎస్సీ తర్వాత విడుదల చేయని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ జాబితాను వెంటనే తయారు చేసి డీఈఓ బ్లాగ్‌లో అందుబాటులోకి తేవాలన్నారు. మునిసిపల్ టీచర్ల పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ జెడ్పీహెచ్ఎస్‌లో 18 సెక్షన్లకు ఒక హిందీ టీచరు ఉన్నారని, సర్దుబాటు కింద మరో టీచరును కేటాయించి విద్యాబోధనకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అపార్ ఐడీ జనరేషన్‌కు విద్యార్థుల ఆధార్ వివరాలు సరిదిద్దుకునేందుకు ప్రతి పాఠశాలలోనూ ఆధార్ కరెక్షన్ కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర, నాయకులు సత్యప్రసాద్, ఆంజనేయనాయక్, అశోక్‌నాయక్, ఫక్రుద్దీన్, తిరుపాల్‌నాయక్, నరసింహులు, హుసేన్‌ఖాన్, బాలాజీ నాయక్ ఉన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్లు సతీష్‌షేర్, నీరద

రాప్తాడు: క్షయ వ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఢిల్లీ నుంచి వచ్చిన క్షయ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ డాక్టర్లు సతీష్ షేర్, నీరద పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని వారు సందర్శించారు. పరిసరాలు, పీహెచ్‌సీలోని గదులను పరిశీలించి, మాట్లాడారు. సమాజ భాగస్వామ్యంతోనే టీబీ నివారణ సాధ్యమవుతుందన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. దుమ్ము, ధూళి ప్రదేశాల్లో పని చేసే వారికి, మద్యపానం, ధూమపానం చేసేవారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా సోకుతుందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందన్నారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, సూపర్‌వైజర్లు నరసింహ, అరుణమ్మ, ఫార్మసీ ఆఫీసర్ మూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'పోలీసులే కేసు నీరు గారుస్తున్నారు'

అనంతపురం ఎడ్యుకేషన్: తన భర్త మోసగించి అబార్షన్ మాత్రలు మింగించాడని ఆధారాలతో సహ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని కంబదూరు మండలం చెర్లోపల్లిలో టీచరుగా పని చేస్తున్న కె.మహేష్ సతీమణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన చేసింది. ఎస్పీ ఆదేశాలతో అనంతపురంలోని దిశ స్టేషన్ డీఎస్పీ విచారించారని ఆధారాలు పరిశీలించి కేసు నమోదుకు కళ్యాణదుర్గం పీఎస్‌లో కలవాలంటూ సలహా ఇచ్చారని పేర్కొన్నారు. అక్కడి పోలీసులు కేసు కట్టకుండా నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారంటూ వాపోయింది. బాధితురాలి పక్షాన కాకుండా నిందితుడికి అండగా నిలుస్తున్నారంటూ ఆరోపించారు. తనకు అబార్షన్ జరిగిన 23 రోజుల తర్వాత మెడికల్ చెకప్‌కు పంపుతామని అంటున్నారని పేర్కొంది. తనకు ముందుగా వివాహం జరిగిందంటూ భర్త చెబుతున్నాడని వాస్తవానికి తనకు బాల్య వివాహం జరిగిందన్నారు. తమపెద్దలు, పోలీసులు జోక్యం చేసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. ఈ విషయం తన పెళ్లికి ముందు పెద్ద మనుషుల సమక్షంలో మహేష్‌కు చెప్పామన్నారు. ఆయన అంగీకరించిన తర్వాతే పెళ్లికి ఒప్పుకున్నాడన్నారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు తనవద్ద ఉన్నాయన్నారు. తనకు న్యాయం జరిగే దాకా పోరాడతానన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పుట్టపర్తి అర్బన్: మండలంలోని బత్తలపల్లి సమీపంలో గంటల మారెమ్మ కనుమ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపిన మేరకు... కనుమ వద్ద సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొన్న ఘటనలో అనంతపురానికి చెందిన దేవేంద్ర కుమారుడు శరత్‌కుమార్ (2) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఘటనలో గాయపడిన దేవేంద్ర, శరత్‌కుమార్‌ను స్థానికులు వెంటనే సత్యసాయి ఆస్పత్రిలో చికిత్స అందించి, మెరుగైన వైద్యం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక సోమవారం అర్ధరాత్రి బాలుడు మృతి చెందాడు.

సంఘాల బలోపేతం కోసమే ప్యూరిఫికేషన్

అనంతపురం కార్పొరేషన్: మహిళా సంఘాల బలోపేతం కోసమే ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మెప్మాపా పీడీ విశ్వజ్యోతి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2007లో సంఘాలు ఏర్పడ్డాయని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్యూరిఫికేషన్ జరగలేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మహిళా సంఘం సభ్యురాళ్లు ఆర్పీలకు తగు సమాచారం అందించాలని కోరారు.

విద్యా రంగానికి నిరాశ

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిరాశే మిగిలిందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా ప్రధానకార్యదర్శి లింగమయ్య మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యారంగానికి 9.8 శాతం మాత్రమే నిధులు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది గత బడ్జెట్‌తో పోల్చుకుంటే చాలా తక్కువన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఈ బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలంటూ కొఠారి కమిషన్ చేసిన సిఫారసులకు దరిదాపుల్లో కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే నిధులు లేక నాడు-నేడు పనులు సగంలో నిలిచిపోయాయన్నారు. ఫలితంగా నూతనంగా నిర్మించిన గదులు నిరుపయోగంగా మారాయన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిల చెల్లింపులు, 12వ పీఆర్సీ అమలుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

చోరీ కేసుల్లో మూడు నెలల జైలు శిక్ష

అనంతపురం: అనంతపురం టూ టౌన్ పరిధిలో జరిగిన మూడు వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష పడింది. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన గుజ్జల రామకృష్ణపై టూ టౌన్ పరిధిలో 2022లో మూడు చోరీ కేసులను అప్పటి సీఐ క్రాంతికుమార్ నమోదు చేశారు. ఇన్వెస్టిగేషన్ చేసి నిందితుడిపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. మంగళవారం అనంతపురం ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రతిభ కేసును విచారించారు. నిందితుడు గుజ్జల రామకృష్ణకు మూడు నెలల జైలు శిక్ష విధించారు. ఏపీపీ సుచిత్ర సాక్షులను విచారించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ సుచిత్ర, అప్పటి సీఐ క్రాంతికుమార్, హెడ్‌కానిస్టేబుల్ సాలప్ప, పీసీ కుమార్‌లను ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

14 నుంచి సహకార వారోత్సవాలు : డీసీఓ

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల 14 నుంచి 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఇ.అరుణకుమారి మంగళవారం తెలిపారు. 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' అనే నినాదంతో 14 నుంచి 20 వరకు జరిగే వారోత్సవాలలో వివిధ రకాల కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. సహకార బ్యాంకులు, సహకార సంస్థలు, సహకార సంఘాలు, ఆయా పాలకవర్గాలు, సభ్యులు, ఈ రంగం అధికారులు, రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

భగవన్నామస్మరణతో మానసిక ప్రశాంతత

అనంతపురం కల్చరల్: భగవన్నామస్మరణతోనే మానసిక ప్రశాంతత కల్గుతుందని జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం కోలార్ పీఠాధిపతులు అద్వైతానంద భారతీస్వామీజీ ప్రబోధించారు. కార్తీక ఏకాదశి సందర్భంగా శృంగేరీ శారదా శంకర మఠంలో స్వామీజీ మంగళవారం ఉదయం చంద్రమౌళీశ్వర పూజలు జరిపించారు. పాతూరు దత్తాత్రేయస్వామి ఆలయం, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం తదితర ఆలయాల్లో భక్తులనుద్దేశించి కార్తీక వైభవ విశిష్టత తెలియజేశారు. అనంతరం స్వయంగా భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కార్తీక ఏకాదశి సందర్భంగా స్థానిక రామనగర్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు రుక్మిణీ పాండురంగస్వామి వార్లకు విశేష పూజలు జరిగాయి. కార్తీకదీపాలతో ఆలయాన్ని కాంతివంతం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో నిజపాద దర్శనం చేసుకున్నారు.

30 మంది బాల కార్మికుల గుర్తింపు

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా సంచార జీవనం సాగించే కుటుంబాల్లోని బాల కార్మికుల గుర్తింపునకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఐసీపీఎస్, చైల్డ్‌లైన్, కార్మిక శాఖ, పోలీస్, సచివాలయ అధికారులు సంయుక్తంగా మంగళవారం అనంతపురం సమీపంలోని రాచానపల్లి వద్ద సంచార జీవనం సాగిస్తున్న వారి గుడిసెలను సందర్శించారు. మొత్తం 30 మంది బాల కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కొందరిని స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించారు. మరికొందరిని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించే విషయమై విద్యా శాఖాధికారులతో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, కార్మిక శాఖ అధికారులు సుజాత, రాధా రమాదేవి చర్చించారు. బుధవారం కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని పీడీ తెలిపారు.చాలా మంది పిల్లలకు ఆధార్ కార్డులు లేవని, ఈ అంశంపై కలెక్టర్‌తో చర్చించి ఆధార్ నమోదుకు త్వరలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జిలాన్ బాషాను బహిష్కరించాలి

అనంతపురం టవర్‌క్లాక్: నాయీ బ్రాహ్మణ కులాన్ని కించపరిచిన కడప జిల్లా టీడీపీ నేత జిలాన్ బాషాను ఆ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో కించపరిచడం తగదన్నారు. వెంటనే అతన్ని పార్టీ నుంచి తొలగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు మల్లికార్జున, ప్రసాద్, నిఖిల్, శివకుమార్, రవీంద్ర, చంద్రశేఖర్, నారాయణ స్వామి, సుబ్బు, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, రఘునాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని సీపీఎం నాయకులు విమర్శించారు. దళితులు, మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్టవేయడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. సీపీఎం న్యూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పవర్ ఆఫీసు సర్కిల్ ఉంచి మున్నానగర్, అంబేడ్కర్‌నగర్ మీదుగా సంగమేష్ సర్కిల్ వరకు ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కమిటీ కార్యదర్శి ఆర్‌వీ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు గోపాల్, ఇర్ఫాన్, నాగరాజు, నల్లప్ప, శంకర్, తదితరులు పాల్గొన్నారు.